జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# పిల్లతెమ్మెర

నవులూరి వెంకటేశ్వరరావు

“దాని సంగతి తెలీదు మీకు. ఈ ఉద్యోగం గురించి ట్రయల్స్‌లో వున్నపుడు ఆఫీసు కొచ్చింది. రామ్మోహనుకు తనను పరిచయం చేసుకుంది. నాలుగున్నరకు వాడు ఇంటికెళ్తుంటే కొంతదూరం వెంటబడిందట వగలు కురిపిస్తూ. గురుడు తెలివైనోడు కదా తప్పించుకో గలిగాడు.”

“ఊహూఁ.”

“ఊహూఁ కాదు. ఇది పచ్చి నిజం. నాల్రోజులు పోతే అన్ని విషయాలూ తెలుస్తాయి మీకే.”

హాల్లో ఆ చివర్సీటు ఆమెది. ఈ చివరిది తనది. తన పక్కనే శేషగిరి. వివరాలు చెబుతున్నది అతనే. అతన్ని వదిలించుకోవాలని వుంది. కానీ యెలానో తెలీడంలేదు. అతనితో యెక్కువ పరిచయంలేదు. చెబుతున్నది వినకుండా ఫైలులో తలదూర్చితే యేమన్నా అనుకుంటాడేమో.

ఇంతలో వాడొచ్చాడు.

“శ్రీపతిగారు పిలుస్తున్నారండి.”

అప్పారావు. పదహారు సంవత్సరాలుంటాయి. పదమూడు, పధ్నాలుగేళ్ళవాడిలా కనిపిస్తాడు. గారపట్టిన పళ్ళు. బండ చెముడు. మొన్నటిదాకా వెనకవైపు వీపుదాకా, ప్రక్కల చెవులమీద నించి భుజాలదాకా పెరిగి అట్టలు కట్టిన జుత్తుండేది. నాల్రోజులుగా ఈ బొద్ద భిక్షువు అవతారం.

ఒక యెక్స్క్యూజ్‌మి చెప్పి సీట్లోనించి లేచాడు.

శ్రీపతి, తనూ కాఫీకి బయలుదేరారు. క్వీ వాల్‌తో బూడిదరంగు క్రేన్స్ రొద చేస్తున్నాయి. నాలుగయిదు నౌకలలో లోడింగ్ అన్లోడింగ్ జరుగుతున్నాయి.

కష్టమ్స్‌వాళ్ళు, పోర్టు సిబ్బంది, ఇండస్ట్రియల్ సెక్యూరిటీవాళ్ళు, పనిచేసే లేబరర్స్.... గందరగోళంగా వుంది డాక్ ఏరియా. ట్రాన్సిట్ షెడ్డులలో నేలపాలయిన గోధుమ గింజలు, సిమెంటు.

క్యాంటీన్ కిటికీలోంచి అన్నీ దర్శనమిస్తున్నాయి.

“వాడ్ని కనుక్కున్నానండి. ఒక్క గదీ వందరూపాయలు చెబుతున్నాడు” శ్రీపతి.

“భరించలేం.”

“మరో యిద్దరికి చెప్పేలేండీ—చూస్తామన్నారు. పోనీ ఆ గది ఖాళీచేసి నా గదికి వచ్చేయండి. అంతవరకూ యెలాగో సర్దుకోవచ్చు.”

“పర్లేదండి. అనవసరంగా మీకు అసౌకర్యం.”

క్యాంటీన్ చాలా అసహ్యంగా వుంది. శుభ్రం అన్న మాటకు తావులేదు అన్నట్లు, నేలంతా ఖాళీ లేకుండా కాగితాలు, సిగరెట్, బీడీ చుట్టల ముక్కలు, దుమ్ము. నడుంచుట్టు ఉండనా మాననా అన్నట్లున్న మాసిన టవల్‌తో “టీ మాష్టర్.” బొమ్మలాంటి కదలిక. శరీరం మీద మరో నూలుపోగు లేదు. చంకలలో పెరి


గిన, ఛాతీనిండా యేపుగా వున్న వెంట్రుకలు అసహ్యాన్ని కలిగిస్తున్నాయి. వేళ్ళకు పొడవుగా పెరిగిన గోళ్ళు మట్టిని దాచుకుని వున్నాయి. ఆ వేళ్ళనే నాలుగయిదు గ్లాసులలో ముంచి టీ, కాఫీలు అందిస్తున్నాడు.

ఆఫీసుకు తిరిగొచ్చేసరికి పదకొండు గంటలవుతుంది. 'మెయిన్ ఆఫీసుకు' అని మూవ్‌మెంటు రిజిష్టరులో వ్రాసి నలుమూలలకు వెళ్ళిపోయిన కారణంగా హాలంతా ఖాళీగా వుంది. నలుగురయిదుగురు మిగిలారు. ఆఫీసు జనాభా తిరుగుళ్ళను అరికట్టటానికి ఆ రిజిష్టరు పెట్టారు. అది యే విధంగానూ ఉపయోగపడటంలేదు. అందులో 'మెయిన్ ఆఫీసు'కు అనో, 'డిస్పెన్సరీకి' అనో, వ్రాసి వెళ్ళిపోతారు పూటలకు పూటలు.

ఆమె, అతను లోకాన్ని మరిచి మాట్లాడుకుంటున్నారు. సుబ్బారావు న్యూస్ పేపరు తీసి "ఓపెన్ పేజ్" చదువుతున్నాడు. శ్రీనివాసరావు, చలపతి షిప్పులలో సంపాయించిన ప్లే బాయ్ యు.అయి, పెంట్ హౌస్ మ్యాగజీన్స్ చూస్తున్నారు.

సరైన పని తనకు యింకా కేటాయించలేదు. చిల్లర మల్లర పనులు చేస్తున్నాడు. అంతా కొత్త. ఊరు కొత్త, పనిచేసే ఆఫీసు కొత్త; వాతావరణం కొత్త. కాకపోతే మనస్తత్వాలు పరిచితాలు! ఎక్కడికెళ్ళినా తారసపడేవి, విశ్వజనీనత వున్నవి.

గంటన్నర పని చేసేసరికి లంచ్ టయిం.



శ్రీపతి దగ్గరకు వెళ్ళాడు. ఇద్దరు డైనింగ్ హాలులోకి చేరారు.

డైనింగ్‌హాల్ రేకుల షెడ్. మనుషులు భోంచేస్తుంటే కుక్కలు బెంచీలక్రింద, టేబిల్స్ క్రింద దూరుతుంటాయి. ముఖ్యంగా ఒక గుడ్డి కుక్క వుంది. ఎవరో రాయితో కొడితే కుడి గ ష్డుగాజు బుడగలా పేలిపోయింది. ఎర్రగా మాంసం కనిపిస్తుంది కనుగుడ్డు వుండవలసిన చోట. ఎంత తోలినా ఈ కుక్క పోదు. కొట్ట బోతే పళ్ళు చూపిస్తూ మొరుగుతుంది. భోంచేసే వాళ్ళకు కుక్కలు ఫర్నిచర్‌లా డైనింగ్ హాలులో ఒక భాగమైపోయాయి. పట్టించు కోవడం మానేశారు.

నేలమీదపడ్డ మెతుకులు కుక్కలపాలయితే క్యారేజీలో మిగిలిన ఎంగిలి మెతుకులు అప్పారావువి. వాడి చేతిలో పింగాణి బొచ్చె. ద్వేషం అంటే తెలీనట్లు కనిపిస్తాడు. దుఃఖం అంట నట్లు అనిపిస్తాడు. ఎప్పుడూ పళ్ళికిలిస్తూ వుంటాడు పలకరింపుగా. మనిషిలో ఎంతో అణకువ. ఊగుతూ నడుస్తాడు.

వాడి తల్లి తన మూడో మొగుడితో వుంటోంది. మొదటి భర్త రైల్వే స్లీపర్లు దొంగతనం చేస్తూ ఆర్పీయఫ్ కాల్పులలో చనిపోయాడు. రెండోవాడు సంవత్సరం కాపురం చేసి వదిలేశాడు. మూడవవాడు పిల్లాడ్ని వదిలేస్తేగాని తనతో వుండనీయ నంటే వాడిని (పిల్లాడిని) బయిటకి వెళ్ళ గొట్టింది.

అరగంటలో సీట్లకు తిరిగి వచ్చారు. ఫైళ్ళలో మునిగి తేలేసరికి సాయంకాలం అయింది. హాలంతా ఖాళీ అయిపోయింది నాలు గున్నరకు అయిదు నిముషాలు ముందుగానే. శ్రీపతి తన సీటు దగ్గరకు వచ్చాడు. పోదామా అన్నాడు. ఇద్దరూ కలసి రోడ్డు దగ్గరకు వచ్చే సరికి చల్లటి గాలి.


"నమస్కారమండీ" గారపళ్ళు ఇకిలిస్తూ వాడు-అప్పారావు. వాడిచుట్టు మరి ముగ్గురు కుర్రాళ్లు: పద్నాలుగేళ్ళ పిల్ల. మాలచ్మి అని పిలుస్తారు దాన్ని మావాళ్ళు. పైట వెయ్యా ల్సిన అవసరరం వున్నా ఆ పిల్ల ఒంటిమీద అది లేదు.

హార్బరు గేటు దగ్గర విపరీతమైన జనాభా. మంగళ శుక్రవారాలలో హార్బరు చూడనిస్తారు. ఈరోజు శుక్రవారం. గేటు కెదురుగా చెట్టు, ప్రక్కనే పోలీస్ స్టేషన్. చెట్టుక్రింద అయిదు న్నర అడుగుల నల్లరాతి విగ్రహంలాంటి, ముక్కున ఎర్ర పుడక వున్న ఆడమనిషి మజ్జిగ అమ్ముతుంది. రంగునీళ్ళ బండి కొంచెం ముందుగా. హార్బరుగోడ పొడవున పదిహేను యిరవై రిక్షాలు. వాళ్ళు మామూలు బేరాలకై అంత బాధపడరు. "షిప్పు" లోంచి ఒక్క "దొర" దొరికితే చాలు అని చూస్తారు. పది, పదిహేను ఎంతైనా దొరకవచ్చు. మీడియం ఆఫ్ కమ్యూనికేషన్ ఇంగ్లీషు అని పిలవబడేది. తెల్ల తోలువాడుగాని, తారు నలుపు తోలువాడుగాని షిప్పులోంచి గేటు దాటితే— వాంట్ మార్కెటింగ్? ఫకింగ్? కమాన్.... టేక్యూ అంటూ వెంటబడతారు. రెండవదైతే (సాధారణంగా, వారాల కొలది సముద్రంమీద ఆకలితో గడిపినవాళ్ళకు అదే అవసరం) రిక్షావాళ్ళకు మరి రెండు డబ్బులు దొరుకు తాయి. వాళ్ళ వృత్తికి సంబంధించినవాళ్ళే అప్పారావు, మిగతా కుర్రాళ్ళు. అప్పారావుకి పగలంతా ఆఫీసువాళ్ళ చిల్లర మల్లర పనులు చేయడానికి, డైనింగ్‌హాల్లో అడుక్కోడానికి సరిపోతుంది. సాయంకాలంపూట ఈ వృత్తి. "దొర"లని "బుక్" చేసుకోలేకపోతే వాళ్ళె క్కిన రిక్షాను వెంబడించి మైలు దూరమైనా పరిగెత్తి అడుక్కుంటారు. దొరికే ఫారన్ కరెన్సీని పక్కనే వున్న బ్యాంక్‌లో మార్చు కుంటారు.

మర్చంట్ నేవీ క్లబ్‌దగ్గరున్న బస్టాపులో నిలబడ్డారిద్దరూ. ఆమె విషయం కదిపాడు తను శ్రీపతితో. ఇంకొకళ్ళ విషయాలలో ఆసక్తి-మానవ బలహీనత. అయితే ఈ వారం రోజులుగా తను చూసిన వ్యక్తుల మాటలు బట్టి వాళ్ళలో కేవలం మిగతావాళ్ళ విషయా లలో ఆసక్తికాక సమాజానికి తమకు యేదో

# రచయిత గురించి

ఆరేళ్ళనుంచి కథలు వ్రాస్తున్నాను. వ్రాసినవి చాలా తక్కువ-ఇరవై కూడా వుండవు. బహుమతి రావడం ఇది రెండవసారి. మొదటిసారి ఆంధ్రజ్యోతి వారు 1977 దీపావళి కథల పోటీలో "పొగమంచు"కు ఒక ప్రత్యేక బహుమతి ఇచ్చారు.



విశాఖపట్నం పోర్టు ట్రస్టులోని స్టోరు డిపార్టుమెంటులో స్టెనోగా వుద్యోగం. వివాహం అయింది. ఒక ఆర్నెల్ల అమ్మాయి (భావన) వుంది. ఈ సర్వసామాన్య విషయాలకన్న చెప్పుకోడానికేమీ లేవు.

---

ద్రోహం జరుగుతున్నట్లు వాళ్ళు భావిస్తున్నట్లు కనిపించారు. తరిచిచూస్తే ఆ తపన కేవలం అసూయకు, ఈర్ష్యకు ముసుగు అనిపించింది.

"మీరు విన్నది నిజమే. కొంత మీ కంటితోనే చూశారు కదా. క్రితం సంవత్సరం జరిగింది. తంగవేలు అని వుండేవాడు. ఏదో షిప్పింగ్ ఏజన్సీలో పనిచేసేవాడు. వయస్సు ముప్పై అయిదు వుంటుంది. బట్టతల ఎప్పుడు చూసినా ఏదో మాట్లాడుకుంటూ కనిపించే వాళ్ళు. అంతులేని విషయాలు. అవేవో వాళ్ళకే తెలియాలి. స్కూటర్ మీద రెండు మూడుసార్లు ఆమె దగ్గరకు వచ్చేవాడు రోజు. సాయంకాలాలు కలిసే గడిపేవాళ్ళు.

"ఆ రోజు బాగా గుర్తుంది నాకు. నేనూ, భానుమతి ఒకే సెక్షనులో వుండేవాళ్ళం. పన్నెండు గంటల టయిం అయివుంటుంది, ఎవరో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. కాస్త బయటికి వస్తారా మీతో మాట్లాడాలి అన్నారు. గుమ్మందాటి నిలబడింది. వాళ్ళేదో చెప్పారు. అంతే. విరుచుకు పడిపోయింది. అందరం కలిసి టేబుల్ మీదికి చేర్చాం. మొహాన నీళ్ళు కొట్టాం. రెండు మూడు నిముషాలకి తేరుకుంది. ఈలోపల ఏం జరిగిందో వాళ్ళని అడిగాం. చెప్పారు. తంగవేలుకు పక్షవాతం వచ్చిందట.

అతని గదికి మకాం మార్చింది. రెండు మూడు నెలలు శలవు పెట్టింది. సంవత్సరం పాటు అతనితో గడిపింది. ఆ తర్వాత అతను చనిపోయాడు.

ఇప్పటి వ్యవహారం రెండు మూడు నెలల నించి జరుగుతోంది.''

బస్సొచ్చింది. కానీ ఆగలేదు. లేడర్ మీద కూడా జనం. ఫుట్‌బోర్డ్సుమీద పాతికమంది వుంటారు. బస్ వాళ్ళు ఎక్కలేదు. బస్ వాళ్ళని లాక్కుపోతోంది. బస్సు లోపల మాత్రం కనీసం పదిహేనుమంది పట్టేంత ఖాళీ.

"నడుద్దాం. బస్సు దొరికేలోపల నడిచే వెళ్ళచ్చు"

లక్ష్మీటాకీసు వైపు నడక. మురికాలువ దాటాలి. ఎవరు పెట్టారో దీనికి లవెండర్ కెనాల్ అని. దానిమీద వున్న వంతెన హౌరా బ్రిడ్జి. దానిపైనించి కన్వేయర్ గ్యాలరి. దాని క్రింద గుడిసెలు. లవెండర్ కెనాల్ చుట్టూ అవే. మెయిన్ రోడ్డు ఎక్కారు. అది రోడ్డు అని పిలవబడే సందు. ఈ వూరి జనానికి సాయంకాల వేళల్లో అదే షాంజెలిజె. దాన్ని వెడల్పు చేయించబోయిన ఒక ప్రభుత్వ భగీ

రధుడు రెండోరోజు బదిలీ చేయించబడ్డాడు.

హోటల్‌లో కాఫీ టిఫిన్ చేసి శ్రీపతి గదికి చేరారు. ఒక గంట చెస్ ఆడిం తర్వాత బాల్కనీలోకి కుర్చీలు లాగాడు శ్రీపతి.

"మానవతా విలువలు క్షీణించిపోతున్నాయి. మనిషి తోటి మనిషితో సమాధానపడలేక పోతున్నాడు. మనుష్యుల మధ్య ద్వేషం పేరుకుపోతోంది. దయార్ద్రత ఆరిపోతోంది. మనిషి ప్రాణానికి విలువ నశించిపోయింది. కాలం చెల్లిన నీతులని పట్టుకుని వ్రేలాడుతున్నాం. ఈనాడు ఏది నీతి ఏది కాదు, దేన్ని పట్టించుకోవాలి, దేన్ని పట్టించుకోగూడదు అన్న ప్రశ్నలు వేధిస్తున్నాయి" అన్నాడు తను అంతకు ముందు గంటనించి రాజ్యమేలుతున్న నిశ్శబ్దాన్ని పారద్రోలుతూ.

ఒక నిముషంపాటు మౌనంగా వున్నాడు శ్రీపతి. తను అన్న మాటలు విన్నట్లు అనిపించలేదు. అప్పుడు గొంతు సవరించుకున్నాడు అన్నాడు——

"భానుమతి విషయం తీసుకుందాం. ఆమె ప్రవర్తనవల్ల మరొకరికి జరిగే నష్టం ఏమీ లేదు. మనిషికి అనేక దైహిక అవసరాలున్నాయి, కోరికలున్నాయి. వాటినించి పారిపోవడానికి కుదరదు. భానుమతి ఒంటరిది. మానవుడికి ఒంటరితనం కూడా ఒక వేధించే సమస్య. ఆయనెవరో అన్నట్లు మానవుడి అనేక చర్యలు ఒంటరితనంనించి పారిపోవడానికి చేసే ప్రయత్నాలలానే అనిపిస్తాయి. ఇంట్లో మరొక తోడులేని స్త్రీ మరొకరి సాన్నిహిత్యాన్ని కోరుకోడం తప్పుకాదు. అందునా, శారీరక అవసరం తీర్చుకోవాలి. ఆకలిలాంటిదే సెక్సూనూ. సెక్సు పరమైన 'అవినీతి'ని భరించలేం.

"సంవత్సరంపాటు ఎలాంటి ఫలాపేక్ష లేకుండా పక్షవాతం వాడితో గడిపింది. తనకు కావలసింది అందిపుచ్చుకుని అతన్ని వదిలి వేయొచ్చు. అలా చేయలేదు. అదీ నీతి. వాడు చచ్చిపొయ్యాడు. మళ్ళీ ఒంటరి జీవితం, దైహిక అవసరం, ఇంకొకరికి చేరువయింది. సమాజానికిగాని, దేశానికిగాని దానివల్ల నష్టం లేదు. వాళ్ళ జీవితంతో జోక్యం కలగజేసుకోవడం ఒకవిధమైన అవినీతి."

ఇద్దరూ సిగరెటు తాగుతున్నారు. ఒకరి మొఖం మరొకరి కనుపడటం లేదు. ఒకరికొకరి సిగరెట్లు మాత్రం కనిపిస్తున్నాయి. పొగ లోపలికి పీల్చినప్పుడు ఎర్రటి వెలుగు. చీకటి రక్తంలా——అప్పుడు మొఖాలు కనిపిస్తున్నాయి. నగరమంతా వున్నట్లుండి సద్దుమణిగినట్లనిపించింది. ఎవరో అన్నట్లు నగరం తనలో దనొదిగిన తాబేలులా వుంది.

"వ్యక్తికి పరిమితమైన 'నీతి'ని ఆ వ్యక్తికే వదిలేయాలి. దాని విషయం పట్టించుకోకూడదు. సమాజంపట్ల మన బాధ్యతలని మనం నెరవేర్చడం వైపు మొగ్గు చూపాలి. మానవతా విలువల్ని గురించి ఆలోచించాలి."

ర ర ర

అప్పారావు తల్లి అదే అన్నారెవరో. కిటికీలోంచి చూస్తే ఆమె కనిపిస్తోంది. అంత పొడవూ పొట్టీ కాదు. కొద్దిగా మాసిన తెల్లచీర నల్ల జాకెట్టు. నలభై సంవత్సరాలు దగ్గిర పడుతున్నాయి. బలమైన మనిషి. కోపంగా చేతులు ఆడిస్తూ మాట్లాడుతోంది. ఏం మాట్లాడుతున్నదీ సరిగా వినపడటం లేదు. ఒక నిమిషం గడిచిన తర్వాత అప్పారావు మెడపట్టుకుని నడుం వంచి మూడు గుద్దులు గుద్ది వెళ్ళిపోయింది కోపంగా.

కూర్మాచారి గదిలోంచి వరండాలోకి వెళ్ళి అప్పారావుగాడ్ని పిలిచాడు.

"ఏంరా మీ యమ్మ కొడుతోంది నిన్ను"

"ఇంకేముందండీ. డబ్బులు కావాలంట."


"నువ్వొద్దుగాని, నీ డబ్బులు మాత్రం కావాలి?"

"ఎన్ని డబ్బులయినా చాలవండీ మా యమ్మకి."

సమాచారసేకరణ తర్వాత గదిలోపలకి వచ్చాడు.

"కాంతూ, వీడెమ్మ మంచి ఎట్రాక్టివ్ పెర్సనాలిటీ వోయ్——వెల్‌బిల్ట్."

"ఆడ కుక్కమీదయినా నీ కన్ను పడటం



మానదు కదా. ఎందుకట వచ్చింది?"

"మామూలేగా, నెలకొకసారి రావడం, వీడికి నాలుగు వడ్డించటం, గోళ్ళూడగొట్టి డబ్బులు రాల్చుకుపోవడం."

రోజులు గడిచిపోతున్నాయి. ఊరు పాత బడి పోతోంది. శ్రీపతికి తనమధ్య సన్నిహితం ఎక్కువవుతోంది. భానుమతి రమణారావుల ప్రేమవ్యవహారంలో కొత్తదనం లేదు.

ఆరోజు మామూలుగా మధ్యాహ్నం డైనింగ్‌హాల్‌కు వెళ్ళాడు. ఒక టేబుల్‌మీద అప్పారావుగాడు పడుకుని మూల్గుతున్నాడు. జ్వరం. అయిదారుగురు చుట్టూ మూగి వున్నారు.

"ఏమిటి కథ? ఏమయింది."

"ఏముందండి. మామూలు కథే, సిఫిలిస్సో గనేరియావో. నెలకూ రెండు నెలలకు వెధవకి అలవాటయి పోయింది."

"ఎక్కడిది కెళ్ళావురా వెధవ?" ఎవరో అడిగారు.

"హౌరాబ్రిడ్జికి— ఇంకెక్కడికి కెళతాడు? ఏ అర్ధరూపాయి ముండ దగ్గరకో వెళ్ళి కొని తెచ్చుకున్నాడు."

"డిస్పెన్సరీకి పోరా వెధవ."

భోంచేయలేకపోయాడు సరిగా. పది నిముషాల్లో వచ్చాడు తిరిగి. క్రమ క్రమంగా అందరూ భోజనాలు ముగించుకుని తిరిగి వచ్చారు ఆఫీసుకు. ఇప్పుడు కాలక్షేపం కావాలి జనాలకి.

"అనకాపల్లి రోడ్డుమీద చూశా ఇద్దరినీ మొదటిసారి. ఒక కిలోమీటరు రాయి దగ్గరున్నారిద్దరూ. వాడు స్కూటర్ బాగు చేస్తున్నాడు. అది ఆ రాయిమీద కూర్చుని వుంది. అది మొదలు అందరికీ తెలిసిపోయింది వ్యవహారం. బొత్తిగా ఈమధ్యే బరితెగించారు."

"అసలు నెల్లూరెక్కడ ఈ వూరెక్కడ? ఆ మూలనించి ఈ మూల కొచ్చిందంటే అక్కడ ఎన్ని గ్రంథాలు నడిపిందో ఎవరికి తెల్సు?"

చలపతి సీట్లోంచి లేచాడు. హెల్మెట్, కళ్ళజోడు పెట్టుకుని బయిటికి వెళ్ళడానికి సిద్ధమయ్యాడు.

"ఇంక బాబుగారు సాయంకాలమేనా దర్శన

మిచ్చేది? నాలుగూయిరవై అయిదుకి ఆఫీసుకు ముఖం చూపించి వెళ్ళండి" వెటకారంగా అన్నాడు కృష్ణారావు.

"మొన్న తమరు చేసిందేమిటో? ఒంటి గంటకొచ్చి, అటెండన్సు రిజిష్టరులో తొమ్మిది న్నర మార్కు చెయ్యాలా?...." అన్నాడు చలపతి.

నోట మాట రాలేదు కృష్ణారావుకు. సెక్షనులో, సగంరోజు శలవుపెట్టానని కోశాడు ఆఫీసుకు రావడం ఒకపూట లేటవటంవల్ల. "ఈ వెధవ రిజిష్టరు తనికీ చేశాడన్నమాట. వీడెవడు అసలు?"

చలపతి వెళ్ళిపోయాడు.

తనవైపు చూస్తూ అన్నాడు కృష్ణారావు గొంతు తగ్గించి. "చలపతిగాడు దాని గురించి పెద్ద చెబుతున్నాడుగాని వీడి భాగవత మేమిటో తెలుసా? వీడి స్నేహితు డున్నాడ్లేండి సన్నగా ఈకలా, పొడవుగా వుంటాడు. వాడు వీడు పెళ్ళాలతో వీడి యింట్లో నెలకు రెండుసార్లు కలవటం వైఫ్ స్వాపింగ్ చేసుకోడం...."

కృష్ణారావు, కూర్మాచారి చాలా క్లోజ్‌గా వుంటాడు. కూర్మాచారి అన్నాడు: "ఒరే కృష్ణా యెవడిమీదో ఒకరిమీద పడడం ఎందు కురా. స్కాండల్స్ లేవదీయడం మంచిది కాదు వోయ్" ఆ మాటలు కృష్ణారావుని ఇంకా ప్రొవోక్ చెయ్యడానికి వుద్దేశించబడ్డాయని తేలికగా తెలుసుకోవచ్చు.

యూరినల్స్‌కి వెళ్ళొస్తానని రూమ్‌లోంచి బయిటికి వచ్చాడు. టాయిలెట్ దుర్గంధ భూయిష్టంగా వుంది. గోడలు మొదలుకొని ఎక్కడ ఖాళీవుంటే అక్కడల్లా వుచ్చలతో తడిసిపోయి వుంది. నీటి సౌకర్యంలేదు. పోయకుండా వుండటం కష్టం. పోయడం మహా కష్టం. బయిటికి వస్తుంటే కూర్మాచారి ఎదురయ్యాడు ముక్కుపొడుం పీలుస్తూ.


"చూశారా! ఒకళ్ళమీద యింకొకళ్ళు ఎలా ఏడుస్తున్నారో? వాడేదో పెళ్ళాం మార్పిడికి పాల్పడతాడని యేడుస్తున్నాడుగాని వీడు నీతిమంతుడా? టెండర్ సెక్షన్‌లో వుండగా ఏదో కొటేషన్ మ్యానిపులేట్ చేయకపోతే పెద్ద గొడవై యీ సెక్షన్లోకి మార్చివేసిన గోవిందు నీతిమంతుడా?"

సాయంకాలం శ్రీపతితో ఈ విషయాలు కదిలిస్తే అన్నాడు: "ఇక్కడ పని చేస్తున్న వేల జనాభాలో యెవర్ని కదిలించినా మరొకడి గురించి యెన్నైనా విషయాలు తెలుస్తాయి. తమది తప్ప మిగతావాళ్ళ ప్రవర్తన బాగుండా లని కోరుకుంటారు. కూర్మాచారి స్టేషనరీ ఇంచార్జి కదా, మూడోవంతు స్టేషనరీ తిరిగి బజార్లో యెలా అమ్ముడుపోతుందో కాంతారావుని కదిలిస్తే చెబుతాడు. నిలేసి అడిగితే కూర్మాచారి అంటాడు ఆఫీసు జీపులు ఆఫీసర్ల పెళ్ళాల్ని మార్కెటింగ్‌కి, సెకండ్ షో సినిమాలకి చేరవేయడానికి, ముండలని తార్చడానికి యెలా వుపయోగపడుతున్నాయో చెబుతాడు. కొందరు డ్రైవర్లు పెట్రోలు కల్తీ చేసి మిగిలినదాన్ని ఎట్లా అమ్ముకుంటున్నారో చెబుతాడు. దీనికి అంతులేదు. దేశంలోని అవినీతి గొలుసు కట్టుకథకి లింకులు వీళ్లు."

సాయంకాలం శ్రీపతిని వెళ్ళిపొమ్మన్నాడు తను. ఆఫీసులో వుండిపోవాలి. నాలుగున్నరకు వెళ్ళడానికి వీలుకాదు. పార్లమెంట్‌లో వేసిన 'స్టార్డ్' ప్రశ్నకు వివరాలు సేకరించాలి. మిగతా తతంగం చాలా వుంది. ఇంటికెళ్ళడం లేటవుతుంది. ముగ్గురు మిగిలారు. నాలుగున్నరకు బయటికెళ్ళి ఒక దొక్కు టీ కొట్టులో టీ త్రాగి వచ్చి పనికి పూనుకున్నారు.

రాత్రి పదవుతుంది పని పూర్తయేసరికి. ఆఫీసు తలుపు వేయించి వెలుపలికి వచ్చారు ముగ్గురూ. వరండాలో చీకట్లో దిగులుగా పడుకునివున్న గజ్జికుక్క. మసకవేసిన వెన్నెల. మెయిన్‌గేటు దాటి నడుస్తున్నారు. ఎక్కడా అంత జనసంచారం లేదు. ఆస్పత్రిలోని దీపాల వెలుగు—బాధలా. ఏదో కిటికీదగ్గర నిలబడి యెవరో దిగులుగా మసక వెన్నెట్లోకి చూస్తున్నట్లు భ్రాంతి. సీమన్స్ క్లబ్ దాటి నాలుగడుగులు వేశారు. అంతే. ఏదో గొడవ జరుగుతోంది.

"పోతుల్లా వున్నారు లంజికొడుకులు."




"తినేది మరేంటి—గొడ్డు మాంసం—గొడ్డులా బలవడే."

"ఈనాకొళ్ళకి గిత్తల కొట్టినట్టు కొట్టి చిప్పెక్కించాలి."

"ఏం జరిగిం దసలు?"

"ఏం జరుగుతుందండి. మదమెక్కిన మనుషులు పశువులతో సమానం. పశువులా వూరి మీద పడితే యేమవుతుంది?"

"అప్పటికీ అది ఒకడి చెయ్యి కరిచింది. ఒకడయితే పర్లేదు. ఇద్దరూ. ఏం చేస్తుంది?"

ఎడమచేతివైపే మైదానం వుంది. అందులో ఒక చిన్న రేకుల షెడ్, బహుశా ఆడవాళ్ళు బట్టలు మార్చుకోడానికి కట్టింది. అక్కడే జరిగింది.

కొరియన్ షిప్పులోంచి ఇద్దరు దిగివస్తున్నారు ఊళ్ళోకి. ఈ ఊరు కొత్తకాదు. శరీరాలలో మండే మంటలాంటి కోరికకి ఆజ్యంలా మధువు తోడయింది.

చలికోత. రిక్షావాళ్ళని వదిలించుకుని పరిచితమైన రోడ్డున పడ్డారు. నడుస్తుండగా—

అప్పారావు తదితరులతో తిరిగే పత్నాలు గేళ్ళపిల్ల 'మాలచ్మి' "గివ్ మి మనీ....."అంది.

ఒకత్తే మిగిలింది. తోటి పిల్లలు లేరు. కడుపులో ఆకలి. ప్రాణం లేసొచ్చింది వాళ్ళని చూడగానే. ఆహారం దొరికినట్లనిపించింది.

"గివ్ మి మని" వెంటబడింది.

ఈసారి తేరిపార చూశారు. చీకటిగా ఉంది. ప్రాణం లేసొచ్చింది. ఆహారం దొరికినట్లనిపించింది. చుట్టూ చూశారు. అదొక్కత్తే ఆ చీకట్లో మానవాకారం. సైగలు చేశారు చేత్తో. షెడ్డు దగ్గరకు రమ్మన్నారు. వయసుకిమించిన అనుభవం వుంది, లోకజ్ఞానం వుంది. రానంది. గడ్డం పట్టుకుని బ్రతిమలాడుతున్నట్లు రమ్మన్నాడు. వదిలించుకుని వెళ్ళబోయింది. ఒకడు, రెండు చంకలలోనించి ఎడమచేయి పోనిచ్చి రెండో చేత్తో నోరు మూశాడు. రెండవవాడు కాళ్ళు పట్టుకొన్నాడు. షెడ్డుదగ్గరకు మోశారు.

అదే సమయంలో "దొర"లతో ఊరంతా తిరిగి వస్తున్నాడు అప్పారావు డైనింగ్ హాల్ వరండాలో పడుకోవడానికి. గొడవ చూసి కేకలేశాడు. ఒకడి చెయ్యి కరిచాడు. వాడు వీడి గొంతు పిసికి కొసప్రాణంతో వదిలాడు. పీలుచిక్కినంతవరకు అరిచి పడిపోయాడు అప్పారావు. ఇంతలో జనం మూగారు. వాడ్ని ఆసుపత్రికి మోసుకెళ్ళారు. వాళ్ళిద్దర్ని పోలీస్ స్టేషన్‌కి అప్పగించారు.

జనం పల్చబడిపోతున్నార్తు. తనూ కదిలాడు. ఉక్కపోతున్న వాతావరణంలోనించి అప్పుడప్పుడూ వీచే పిల్లగాలి మరొకసారి వీచింది. సిగరెట్ ముట్టించాడు. □